సాక్షి రంగారెడ్డి

సోమవారం, 6, నవంబర్, 2023



మహేశ్వరం..రసవత్తరం

మహేశ్వరం నియోజకవర్గంలో ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. స్థానికంగా త్రిముఖ పోటీ నెలకొంది. 10లో▸



'హస్తం' నిరీక్షణ ఫలించేనా?

పట్నం నియోజకవర్గంలో 40 ఏళ్ల కాంగ్రెస్ నిరీక్షణకు తెరపడనుందా..? పార్టీ శ్రేణులు గెలుపు కోసం ఎదురు చూస్తున్నాయి. 10లో▸

మెథడిస్టు జాతర వాయిదా

ధారూరు: లక్షలాదిగా ఏసుక్రీస్తు భక్తులు తరలివచ్చే ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతర తేదీల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈనెల 30న ఎన్నికల నేపథ్యంలో జాతరకు ఏర్పాట్లు, బందోబస్తు సాధ్యం కాదని కలెక్టర్, ఎస్పీ తేల్చి చెప్పారు. దీంతో జాతరను డిసెంబర్ 5 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తామని కమిటీ తెలిపింది.

న్యూస్‌రీల్

ఉత్కంఠకు తెర

- మహేశ్వరం కాంగ్రెస్ బీఫాం కేఎల్ఆర్‌కే..
- చివరి వరకు ఆశించిన 'చిగురింత'



కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి బీఫాంను ఆయన బంధువుకు అందజేస్తున్న పార్టీ పెద్దలు

మహేశ్వరం: ఉత్కంఠకు తెరపడింది. మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికే బీఫాం దక్కింది. ఈ మేరకు ఆదివారం గాంధీ భవన్‌లో ఆయన తరఫున సమీప బంధువు వెంకట్రామిరెడ్డి ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, విశ్వనాథ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యక్షుడు నిరంజన్ చేతుల మీదుగా అందుకున్నారు. బీఫాం కోసం కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, చిగురింత పారిజాత పోటీపడ్డారు. దీంతో ఎవరికి పార్టీ బీఫాం వస్తుందోనన్న ఉత్కంఠ రేపింది. ఇప్పటికే టికెట్ ఆశించిన చిగురింత పారిజాత తరఫున ఆమె మద్దతుదారులు నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. చివరికి కేఎల్లార్‌కే బీఫాం రావడంతో ఉత్కంఠకు తెరపడింది. కేఎల్లార్‌కు చిగురింత మద్దతు పలుకుతారా, లేదా ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటారా అనేది చర్చనీయాంశంగా మారింది.

బీఆర్ఎస్‌తోనే యువతకు భవిత

ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి



యువ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: బీఆర్ఎస్ పార్టీతోనే యువతకు భవిష్యత్తు ఉంటుందని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలకేంద్రంలోని ఓ ఫాంహౌస్‌లో ఆదివారం సాయంత్రం మండల యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎంపీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. బీఆర్ఎస్ గెలుపులో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. సోషల్‌మీడియా ద్వారా అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోపై బూత్‌స్థాయిలో చర్చ జరిగేలా యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్: నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేసే ముఠాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సరూర్‌నగర్ ఎక్సైజ్ శాఖ ఏఈఎస్ హనుమంతరావు పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ఎక్సైజ్‌శాఖ, రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య, సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ టి.రవీందర్‌రావు ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున అబ్దుల్లాపూర్‌మెట్‌లో విజయవాడ జాతీయ రహదారిపై హయత్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో విశాఖపట్నం నుంచి ప్రైవేట్ బస్సులో అక్రమంగా తరలిస్తున్న మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులో తీసుకున్నారు. నిందితుడిని విచారించగా అతడు కర్ణాటక రాష్ట్రం కొడుగు జిల్లా కర్రెకొప్ప గ్రామానికి చెందిన కేసీ గణేశ్‌గా గుర్తించారు. గంజాయి విలువ సుమారు రూ.75 వేలు ఉంటుందని, నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సరూర్‌నగర్ డీటీఎఫ్ సీఐ టి.సత్యనారాయణ, ఎస్ఐలు జి.హనుమంతు, ఎండీ పాష, యాదయ్య, సరూర్ నగర్ ఎక్సైజ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆమనగల్లు: ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం

కారు.. హుషారు



ఆమనగల్లు: కేటీఆర్‌కు మేకపిల్లను బహూకరిస్తున్న నాయకులు

ఆమనగల్లులో ఆశీర్వాద సభ

- షాద్‌నగర్‌లో రోడ్ షో
- కదిలిన గులాబీ దండు
- భారీగా తరలి వచ్చిన జనం
- బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

ఆమనగల్లు/షాద్‌నగర్: బీఆర్ఎస్ ఆదివారం ఆమనగల్లు, షాద్‌నగర్‌లో నిర్వహించిన ఆశీర్వాద సభ, రోడ్‌షోలతో పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. రోడ్లన్నీ గులాజీ జెండాల రెపరెపలతో సందడిగా కనిపించాయి. ఆమనగల్లులోని జూనియర్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఆదివారం రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో సభ విజయవంతమైంది. సభలో కళాకారుల ఆటాపాటలు అలరించాయి. కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామానికి చెందిన మహిళలు పాడిన గులాబీల జెండాలే రామక్క పాట ఉర్రూతలూగించింది.

ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటుకు హామీ

ఆమనగల్లులో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటుకు మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. సభలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కల్వకుర్తిలోని రఘుపతిపేట, వెల్జాల, గట్టుప్పలపల్లి గ్రామాలను మండలాలుగా చేయాలని, ఆమనగల్లులో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. స్పందించిన మంత్రి కల్వకుర్తి నుంచి జైపాల్‌యాదవ్‌ను గెలిపిస్తే కొత్తగా మూడు మండలాలను ఏర్పాటు చేయడంతో పాటు ఆమనగల్లులో ఆర్డీఓ కార్యాలయం, ఇతర డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కడ్తాల్‌కు చెందిన టీఆర్ఎస్ నాయకులు మంత్రి కేటీఆర్‌కు గొంగలి కప్పి మేకపిల్లను బహూకరించారు. ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ గిరిజన సాంప్రదాయ దండను మంత్రికి వేశారు. ఆమనగల్లుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎంగలి రఘు గదను బహూకరించారు. మైనార్టీ నాయకుడు సయ్యద్ ఖలీల్ మంత్రి భుజానికి పట్టీ కట్టారు.

అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ కోరారు. తెలంగాణను తీసుకువచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్న సీఎం కేసీఆర్ తెలంగాణ మహాత్ముడని కొనియాడారు. బీఆర్ఎస్ ద్వారా ఎమ్మెల్సీ పదవి పొంది పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. సభలో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ ఉప్పల వెంకటేశ్, జెడ్పీటీసీ సభ్యులు దశరథ్‌నాయక్, విజితారెడ్డి, ఎంపీపీ నిర్మల, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ తోట గిరియాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావ్, మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, వైస్ ఎంపీపీ జక్కుఅనంతరెడ్డి పాల్గొన్నారు.

కిక్కిరిసిన షాద్‌నగర్

షాద్‌నగర్‌లో నిర్వహించిన మంత్రి కేటీఆర్ రోడ్ షోకు కొత్తూరు, కొందుర్గు, నందిగామ, చౌదరిగూడ, కేశంపేట, ఫరూఖ్‌నగర్‌తో పాటు పట్టణంలోని అన్ని వార్డుల నుంచి జనం భారీగా తరలివచ్చారు. షాద్‌నగర్ చౌరస్తా కిక్కిరిసిపోయింది. రోడ్ షో సందర్భంగా పట్టణ చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన డీజే పాటలు అలరించాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. బుగ్గారెడ్డి గార్డెన్‌పై, ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే అంజయ్య చేసిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, ఎన్నికల ప్రచారాలకు సంబంధించిన వీడియోలను, సభకు సంబంధించి లైవ్‌ను ఎల్ఈడీ తెరలపై ప్రసారం చేశారు.

ఆకట్టుకున్న ప్రసంగం

మంత్రి కేటీఆర్ చేసిన ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. ఇరవై నిమిషాల పాటు మంత్రి చేసిన ప్రసంగంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి గురించి మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ నేతల తీరుపై విరుచుకపడ్డారు.

భారీ బందోబస్తు

మంత్రి రోడ్ షో సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంలో పట్టణ సీఐ ప్రతాప్‌లింగం నేతృత్వంలో పటిష్ట బందోబస్తును నిర్వహించారు. చౌరస్తాలో సభ సందర్భంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌ను మళ్లించారు.



షాద్‌నగర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, చిత్రంలో మంత్రి కేటీఆర్ తదితరులు

హ్యాట్రిక్ విజయాన్ని అందించాలి

వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని, తద్వార తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తెలిపారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి మేనిఫెస్టో రూపొందించారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ప్రజలను మోసం చేసేందుకు అనేక హామీలు ఇస్తున్నారని, వారి మాటలు నమ్మి బతుకులను ఆగం చేసుకోవద్దన్నారు. షాద్‌నగర్ ప్రాంతంలో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు మంత్రి కేటీఆర్ ఇప్పటికే హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచి భారీ మెజార్టీని అందించాలని కోరారు.

తండ్రి విజయం కోసం తనయ..



కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ కుమార్తె శిరీష ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ 38వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ ప్రాంత ప్రజల కష్టాలు తెలిసిన శ్రీరాములు యాదవ్‌ను ఆశీర్వదించాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. – మీర్‌పేట

మామ గెలుపు కోసం కోడళ్లు



మామ గెలుపు కోసం కోడళ్లు ప్రచారం చేస్తున్నారు. షాద్‌నగర్ బీజేపీ అభ్యర్థి అందె బాబయ్యకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోడళ్లు సరిత, మాధురి, దివ్య ఆదివారం పట్టణంలోని సాయిబాబ కాలనీ, సాయిప్రియ, పోచమ్మగుడి కాలనీల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. – షాద్‌నగర్

'పట్నం' సీపీఎం అభ్యర్థిగా పగడాల



పగడాల యాదయ్య

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్‌తో పొత్తు పొడవని కారణంగా ఇబ్రహీంపట్నం సీపీఎం అభ్యర్థిగా పగడాల యాదయ్యను ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. 2014, 2018 ఎన్నికల్లో యాదయ్య సీపీఎం నుంచి బరిలో నిలిచి ఓటమిపాలయ్యారు. మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

పేరు: పగడాల యాదయ్య
పుట్టిన తేదీ: 04-03-1968
తల్లిదండ్రులు: పగడాల వెంకటమ్మ, రాములు
విద్యార్హత: డిగ్రీ
స్వగ్రామం: చెన్నారెడ్డిగూడ, మంచాల మండలం
భార్య: పగడాల యశోద
పిల్లలు: ఇద్దరు కూతుళ్లు
రాజకీయ నేపథ్యం: సీపీఎం నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. చెన్నారెడ్డిగూడ గ్రామ శాఖ అధ్యక్షుడిగా మొదలై నియోజకవర్గ పార్టీ కన్వీనర్‌గా, జిల్లా కమిటీ సభ్యుడిగా, డీవైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక, రైతు, వృత్తి సంఘాల్లో పలు పదవులు చేపట్టి ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1992 నుంచి 1995 వరకు పీఏసీఎస్ చైర్మన్‌గా, 1995 నుంచి 2000 వరకు మంచాల ఎంపీపీగా, 2001 నుంచి 2006 వరకు మంచాల జెడ్పీటీసీగా ఉన్నారు. ఆయన సతీమణి యశోద చెన్నారెడ్డి సర్పంచ్‌గా 2006 నుంచి 2013 వరకు కొనసాగారు.

మీ అభ్యర్థుల గురించి తెలుసుకోండిలా..

మీకు తెలుసా?

KYC KNOW YOUR CANDIDATE

సాధారణ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలు తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. 'నో యువర్ క్యాండిడేట్' (కేవైసీ) పేరిట ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫాంలపై రూపొందించిన ఈ యాప్‌ను ప్లే స్టోర్/ యాప్ స్టోర్‌ల ద్వారా నేరుగా స్మార్ట్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాలకు సంబంధించి పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన వెంటనే వారి వివరాలను ఈ యాప్‌లో పొందుపరుస్తారు. అభ్యర్థి వ్యక్తిగత వివరాలతో పాటు క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్‌ను కూడా తెలుసుకునే అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తొలి రెండు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా నామినేషన్‌లు దాఖలు చేసిన 236 అభ్యర్థుల వివరాలను ఇప్పటికే యాప్‌లో పొందుపరిచారు. – కంటోన్మెంట్

చేవెళ్ల కాంగ్రెస్‌లో గందరగోళం

- పార్టీ అభ్యర్థి భీంభరత్‌కు అందని బీఫాం
- అభ్యర్థిని మారుస్తారని జోరుగా ప్రచారం
- నియోజకవర్గంలో చర్చనీయాంశం
- పార్టీ నాయకులు, కార్యకర్తల్లో అయోమయం
- అలాంటిదేమీ లేదని కొట్టిపారేస్తున్న భీంభరత్ వర్గీయులు

చేవెళ్ల: కాంగ్రెస్ అభ్యర్థిని మారుస్తారనే ప్రచారంతో చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో గందరగోళం నెలకొంది. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా పలు టీవీ చానళ్లు, సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో మూడు సీట్లలో అభ్యర్థుల మార్పు జరుగుతుందని.. అధిష్టానం ఆయా స్థానాలపై పునరాలోచన చేస్తోందన్న ప్రచారం సాగింది. ఈ మూడు సీట్లలో చేవెళ్ల పేరు సైతం ఉండడంతో నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. అధిష్టానం ఆదివారం పలువురు అభ్యర్థులకు పార్టీ బీఫాంలను అందజేసింది. అందులో చేవెళ్ల అభ్యర్థి పామెన భీంభరత్ లేకపోవడం ప్రచారానికి మరింత ఊతమిచ్చింది. కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచీ చేవెళ్ల అభ్యర్థి ఎవరనేదానిపై చర్చ జరుగుతూ వచ్చింది. గతంలో పనిచేసిన ఎమ్మెల్యే స్థాయి నాయకులు లేకపోవటంతో స్థానిక నాయకులతో పాటు బయట వారు కూడా ఈ సీటుపై దృష్టి సారించారు. స్థానిక నాయకత్వం కొత్తవారు కావడంతో పార్టీలోని పెద్ద నేతలను దించుతారనే ప్రచారం కూడా సాగింది. పార్టీ అభ్యర్థిగా పామెన భీంభరత్ పేరును ప్రకటించే వరకు ఉత్కంఠ కొనసాగింది. చివరికి మొదటి జాబితాలోనే స్థానిక నాయకుల్లో ఒకరైన భీంభరత్‌ను ప్రకటించటంతో ఉత్కంఠకు తెరపడిందని అంతా అనుకున్నారు. ఆయన ప్రచార జోరును కూడా పెంచారు. ఈ తరుణంలో అభ్యర్థి మార్పు అనే ప్రచారం జరగడంతో ఆశావహుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి.

ఆ ప్రచారంలో వాస్తవం లేదు..

అభ్యర్థి మార్పు అన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పార్టీ సీనియర్ నాయకులు, పామెన భీంభరత్ వర్గీయులు కొట్టి పారేస్తున్నారు. ఈ విషయంపై అధిష్టానం పెద్దలతో మాట్లాడినట్టు చెబుతున్నారు. సోమవారం ఉదయం పామెన భీంభరత్‌కు బీఫాం ఇస్తాం రావాలని సందేశం వచ్చిందని కూడా చెబుతున్నారు. మార్పు ఏమీ లేదని.. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన పని లేదని.. ప్రచారం కొనసాగించాలని పేర్కొంటున్నారు. అధిష్టానం ప్రకటించిన అభ్యర్థుల్లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేస్తున్నారు.

మరోసారి గెలిపించండి

- మరింత అభివృద్ధి చేసి చూపిస్తా
- మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.400కే వంట గ్యాస్ అందిస్తామని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లి, కేసీ తండా, రావిర్యాల, కందుకూరు మండలం నేదునేరు, మాన్యగూడ గ్రామాలకు చెందిన పలువురు ఆదివారం మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు, తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీ నుంచి స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. వంద కోట్ల నిధులను తీసుకొచ్చి నియోజకవర్గంలో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కాలేజీల నిర్మాణం చేశామన్నారు. నియోజకవర్గంలో భారీ పరిశ్రమలు, కంపెనీలు తీసుకొచ్చి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పని చేశానని, మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అంతకు ముందు మన్సాన్‌పల్లి, కేసీ తండా, రావిర్యాల గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, పార్టీ తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు జెల్లెల లక్ష్మయ్య యాదవ్, రావిర్యాల మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాట సురేష్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన రావిర్యాల గ్రామానికి చెందిన యువకులు

అన్ని విధాలా అభివృద్ధి చేశాం

హుడాకాంప్లెక్స్: ఐదేళ్లలో నియోజకవర్గంలోని కాలనీల్లో అధిక నిధులు వెచ్చించి ఎంతో అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ మహేశ్వరం అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి కోరారు. మిత్ర ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీ సంక్షేమ సంఘాలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.400కే గ్యాస్ సిలిండర్, రూ.2 వేలల ఆసరా పెన్షన్లు రూ.5 వేలు, రూ.4 వేల దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచుతామని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు బోయిని మహేందర్ యాదవ్, మాజీ అధ్యక్షుడు ఇంటూరు అంకిరెడ్డి, లోకసాని కొండల్ రెడ్డి, బేర బాలకిషన్, జిల్లెల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘హస్తం’ నిరీక్షణ ఫలించేనా..?

- ‘పట్నం’పై నలభై ఏళ్లుగా ఎగరని కాంగ్రెస్ జెండా
- ఆధిపత్యం చూపిన టీడీపీ, సీపీఎంలు

గ్రేటర్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ రాజకీయం ప్రతీ ఎన్నికలో రసవత్తరంగానే ఉంటోంది. టికెట్ రేసులో ఉండి ఎన్నికల వరకు పార్టీ కేడర్ కాపాడుతూ వస్తున్న నేతలకు ఆ పార్టీ మిత్రపక్షాలకు టికెట్ వదిలేసి నమ్మిన వారికి మొండి చేయి చూపుతోంది. 2023లో పార్టీ అభ్యర్థికే టికెట్ కేటాయించారు. దీంతో పట్నంపై హస్తం విజయపతాకం ఎగరేసేనా అన్న చర్చ మొదలైంది.

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 40 ఏళ్ల కాంగ్రెస్ నిరీక్షణకు తెరపడనుందా..? ఇన్నేళ్లుగా ఇక్కడ నుంచి హస్తం గుర్తుపై గెలిచిన శాసన సభ్యుడు లేక నిరాశలో ఉన్న పార్టీ శ్రేణులకు ఊరట దక్కనుందా అనే చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా కొన సాగుతోంది. 1983 ఎన్నికల్లో ఏజీ కృష్ణ అనంతరం ఆ పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహించే వారు లేక కాంగ్రెస్ శ్రేణులు డీలా పడ్డాయి. 2004లో వైఎస్సార్ హయాంలోనూ టికెట్‌ను మిత్రపక్షాలైన సీపీఎంకు కేటాయించడంతో నియోజకవర్గంలో ఎర్రజెండా ఎగురవేసింది. నియోజకవర్గం ఏర్పాటు నుంచి 16 ఎన్నికలు జరగ్గా.. 1952 నుంచి 1983 వరకు వరసగా ఎనిమిది సార్లు హస్తగతం చేసుకుంది.



సైకిల్‌పై ముగ్గురు అసెంబ్లీకి

1983లో టీడీపీ స్థాపన తర్వాత సైకిల్ హవా కొనసాగింది. 1985 ఎన్నికల్లో కె.సత్యనారాయణ టీడీపీ నుంచి గెలుపొందారు. అనంతరం 1999లో కొండ్రు పుష్పలీల, 2009, 14 ఎన్నికల్లో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి టీడీపీ నుంచి గెలుపొంది శాసనసభకు వెళ్లారు. తెలంగాణ ఉద్యమ ప్రభావం కారణంగా టీడీపీ ప్రాబల్యం తగ్గడంతో మంచిరెడ్డి సైకిల్ దిగి కారెక్కారు. 2018లో టీఆర్ఎస్ నుంచి గెలుపొంది హ్యాట్రిక్ విజయం తన ఖాతాలో వేసుకున్నారు.

ఎర్రజెండా రెపరెపలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కమ్యూనిస్టులకు మొదటి నుంచి మంచి పట్టు ఉంది. 1989, 1994లో టీడీపీతో పొత్తులో భాగంగా ‘పట్నం’ సీటును రెండు పర్యాయాలు సీపీఎంకే ఇవ్వడంతో కొండిగారి రాములు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999లో కొండిగారి రాములు ఏ పార్టీతో పొత్తు లేకుండా పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఆ తరువాత 2004లో కాంగ్రెస్ పార్టీతో పొత్తులో భాగంగా మస్కు నరసింహ సీపీఎం తరుపున పోటీ చేసి గెలుపొందడంతో మొత్తం మూడు సార్లు నియోజకవర్గంలో ఎర్ర జెండా రెపరెపలాడింది.

గెలుపు వరించేనా..?

2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 9,216 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2014లో ఆ పార్టీ క్యామ మల్లేశ్‌కు టికెట్ కేటాయించడంతో మల్‌రెడ్డి రంగారెడ్డి సోదరుడు మల్‌రెడ్డి రాంరెడ్డి ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచారు. దీంతో హస్తం పార్టీకి ఓటమి తప్పలేదు. 2018లో మహాకూటమి పొత్తులో భాగంగా టీడీపీకి టికెట్‌ను కేటాయించడంతో సామ రంగారెడ్డి బరిలో నిలిచారు. బీఎస్పీ తరుపున పోటీచేసిన మల్‌రెడ్డి రంగారెడ్డికి కాంగ్రెస్ బహిరంగంగానే మద్దతు తెలిపిన స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారు. ప్రతీ సారి గెలుపు హస్తం పార్టీ నాయకులను దోబూచులాడుతుండటంతో ఈ ఎన్నికల్లో బరిలో నిలుస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డిని వరిస్తుందా లేదా అన్నది తేలడానికి డిసెంబర్ 3 వరకు ఆగాల్సిందేనని నియోజకవర్గ నేతలు చర్చించుకుంటున్నారు.

నామినేషన్ ఘట్టం.. ‘ఎపిక్’ ఎంతో కీలకం..



నామినేషన్ ఘట్టంలో అభ్యర్థి భవితవ్యం ఓటరు ఎపిక్ నంబరు మీద ఆధారపడి ఉంటుంది. అభ్యర్థి వేసే నామినేషన్ తిరస్కరణకు గురికాకుండా ఉండాలంటే ఓటరు జాబితాలోని అభ్యర్థి పేరు, క్రమసంఖ్య, భాగం సంఖ్య సరిగ్గా ఉండాలి. ఇదే సూత్రం ప్రతిపాదకులకు కూడా వర్తిస్తుంది. నామపత్రాన్ని సమర్పించేటప్పుడు ముందుగా సరైన క్రమసంఖ్య, భాగం సంఖ్యను నామినేషన్ పత్రంలో పూరించాల్సి ఉంటుంది. ఎన్నికల హడావుడిలో అందరికీ అందుబాటులో ఓటరు జాబితాలు ఉండవు. పాత ఓటరుకార్డు మీద క్రమ సంఖ్య, భాగం సంఖ్యను పూరిస్తే ఒక్కోసారి తిరస్కరణకు గురయ్యే అవకాశం లేకపోలేదు. నామినేషన్ వేసే అభ్యర్థులు తమ ఓటు హక్కు వివరాలను, ప్రతిపాదకుల వివరాలను తెలుసుకోవడానికి ఎపిక్ నంబరు సాయం తీసుకోవాలి. ఇదెంతో సులభతరంగా దోహదపడుతుంది. ఓటరు జాబితాలోని పేజీలను తిరగేయడం కంటే స్మార్ట్‌ఫోన్‌లోని ఓటర్స్ సర్వీస్ పోర్టల్‌ను ఆశ్రయిస్తే సరిపోతుంది. ఓటరు జాబితాలో జరిగే మార్పుల చేర్పుల్లో ఓటరు క్రమ సంఖ్య, భాగం సంఖ్య మారుతుంటుందే తప్ప ఎపిక్ నంబరు ఎప్పటికీ మారదు.

– నాంపల్లి

అంబర్‌పేట బరిలో గురుశిష్యులు!



కృష్ణయాదవ్ వెనుక కూర్చున్న రోహిన్‌రెడ్డి వృత్తంలో (ఫైల్)

అంబర్‌పేట నియోజకవర్గంలో గురుశిష్యుల మధ్య ఎన్నికల పోటీ ఆసక్తికరంగా మారింది. బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి కృష్ణయాదవ్‌కు ఒకప్పుడు, ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి రోహిన్‌రెడ్డి ప్రధాన శిష్యుడు 1994, 99 వరకు పూర్వ హిమాయత్ నగర్ నియోజకవర్గం నుంచి కృష్ణయాదవ్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బర్కత్‌పురాలో నివాసం ఉండే రోహిన్‌రెడ్డి విద్యార్థిగా ఉన్న సమయంలోనే కృష్ణయాదవ్‌తో అనుబంధం ఏర్పడింది. అప్పటినుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా విధులు నిర్వహించే కృష్ణయాదవ్‌కు ప్రధాన అనుచరుల్లో రోహిన్‌రెడ్డి ఒకరు. అలా ఎన్నికల్లో రోహిన్‌రెడ్డి తోడ్పాటు అందించారు. 2000 సంవత్సరంలో ఆయన మెడిసిన్ చదువు నిమిత్తం బయటి ప్రాంతానికి వెళ్లారు. 2006లో కృష్ణయాదవ్ కొన్ని పరిణామాలతో రాజకీయాలకు దూరమయ్యారు. కృష్ణయాదవ్ లేకపోవడంతో రోహిన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుత టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి, రోహిన్‌రెడ్డికి పాత పరిచయం ఉంది. దీంతో రోహిన్‌రెడ్డికి కాంగ్రెస్‌లో మంచి అండ దొరికింది. రేవంత్‌రెడ్డి సహకారంతో అనూహ్య పరిణామాల మధ్య ఈ ఎన్నికల్లో అంబర్‌పేట అభ్యర్థిగా రోహిన్‌రెడ్డి బరిలోకి వచ్చారు. రోహిన్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా ఖరారు అయిన రెండు రోజులకే తన గురువు కృష్ణయాదవ్‌కు బీజేపీ తరపున టికెట్ వరించింది.

– అంబర్‌పేట

మహేశ్వరం.. రసవత్తరం

జంగ్ తెలంగాణ

గ్రామీణం, పట్టణం, నగరం మూడు ప్రాంతాలు కలిసి ఉండే ప్రాంతం మహేశ్వరం నియోజకవర్గం. 2009లో ఏర్పడిన ఈ సెగ్మెంట్‌లో మహేశ్వరం, కందుకూరు మండలం, తుక్కుగూడ మున్సిపాలిటీతో పాటుగా జీహెచ్ఎంసీలోని సరూర్‌నగర్ ప్రాంతం ఇందులోనే ఉంటుంది. ఇప్పటికి మూడు మార్లు ఎన్నికలు జరగ్గా రెండు సార్లు కాంగ్రెస్‌కు, ఒకసారికి ‘కారు’కు ఇక్కడి ప్రజలు పట్టం కట్టారు.

- దేశంలోనే తొలి మహిళా హోంమంత్రిని ఇచ్చిన సెగ్మెంట్‌గా రికార్డు
- రాష్ట్రంలో తొలి మహిళా మంత్రి ఇక్కడ నుంచే..
- ‘కారు’కు ‘కమలం’కు దక్కని అవకాశం
- పక్క నియోజకవర్గం నుంచి వచ్చి ప్రత్యర్థులుగా మారిన సబిత, కేఎల్ఆర్





పటోళ్ల సబితారెడ్డి



తీగల కృష్ణారెడ్డి



అందెల శ్రీరాములు యాదవ్

మహేశ్వరం: దేశంలోనే తొలి మహిళా హోంమంత్రిని అందించిన ఈ నియోజకవర్గం చరిత్రకెక్కింది. విభిన్న జాతులు, వర్గాలు, ప్రాంతాల మిళితం ఈ సెగ్మెంట్. ఇక్కడ హస్తం గుర్తుపై గెలుపొందిన సబితారెడ్డి రాజశేఖర్‌రెడ్డి మంత్రి వర్గంలో పనిచేశారు. 2018 విజయం తర్వాత కాంగ్రెస్‌ను వీడి కారెక్కింది. దీంతో ఆమెకు సీఎం కేసీఆర్ తన మంత్రి వర్గంలో బెర్తు కల్పించారు. దీంతో ఆమె తెలంగాణలోనూ తొలి మహిళా మంత్రిగా రికార్డు సృష్టించారు. నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ, మైనార్టీల ఓట్లు అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తుంటాయి.

ఫ్యాబ్‌సిటీ ఏర్పాటుతో పెరిగిన ఓటర్లు

నియోజకవర్గంలో ఫ్యాబ్ సిటీ(ఈ-సిటీ), హార్డ్‌వేర్ పార్కు, కందుకూరులో ఫార్మాసిటీ, మహేశ్వరంలో ఎలక్ట్రానిక్ పార్కులో భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఈ పరిశ్రమలు ఉండడంతో దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఫ్యాబ్‌సిటీ(ఈ-సిటీ)లో పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. స్థానికేతరులు ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకోవడంతో ఓట్లు భారీగా నమోదయ్యాయి. నియోజకవర్గాన్ని మినీ భారత్‌గా పిలుస్తారు.

జనరల్ స్థానంగా

2009 సంవత్సరంలో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా మహేశ్వరం నియోజకవర్గం ఏర్పడింది. నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి నేటి వరకు జనరల్ స్థానంగా ఉంది. మహేశ్వరం, కందుకూరు మండలాలు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలో ఉండేవి. బాలాపూర్, సరూర్‌నగర్ రెండు అర్బన్ మండలాలు మలక్‌పేట్ నియోజకవర్గ పరిధిలో ఉండేవి. డీలిమిటేషన్‌తో మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్, సరూర్‌నగర్ మండలాలను కలుపుతూ మహేశ్వరం నియోజకవర్గం ఏర్పాటైంది.

పట్టు సాధిస్తున్న పటోళ్ల

మహేశ్వరం నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి మూడు సార్లు ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్ నుంచి సబితారెడ్డి రెండుసార్లు, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి(టీకేఆర్) టీడీపీ నుంచి ఒక సారి గెలుపొందారు. చెవేళ్ల నుంచి వచ్చి మహేశ్వరంలో పోటీ చేసి రెండు పర్యాయాలు గెలుపొందిన సబితారెడ్డి నియోజకవర్గవాసుల ఆత్మభిమానం చూరగొన్నారు. నియోజకవర్గంలో ఆమెకు వ్యక్తిగతంగా బలమైన కేడర్‌ను తయారు చేసుకుంది. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్నారు.

త్రిముఖ పోరు

ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. బీఆర్ఎస్ నుంచి సబితా ఇంద్రారెడ్డి, కాంగ్రెస్ నుండి కిచ్చనగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్), బీజేపీ నుంచి అందెల శ్రీరాములు యాదవ్‌లు పోటీ చేస్తున్నారు. మూడు ప్రధాన పార్టీలకు నియోజకవర్గంలో బలమైన ఓటు బ్యాంకు ఉంది. నియోజకవర్గంలో ఈ సారి బీఆర్ఎస్‌ను బోణీ కొట్టిస్తాననే ధీమాతో మంత్రి సబితారెడ్డి ముందుకు వెళ్తున్నారు. మరోసారి మా కంచుకోటపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడిస్తామని కేఎల్ఆర్ గట్టి నమ్మకంతో పనిచేస్తున్నారు. సానుభూతితోపాటుగా బలమైన కేడర్ ఉండడం కమలానికి కలిసి వస్తుందని అందెల శ్రీరాములు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా ఈ ఎన్నికలో నియోజకవర్గంలో త్రిముఖ పోరు తప్పదని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

నియోజకవర్గం ఏర్పాటు నుంచి ఎన్నికల వివరాలు

సంవత్సరం	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజారిటీ
2009	సబితారెడ్డి	కాంగ్రెస్	తీగల కృష్ణారెడ్డి	టీడీపీ	7,833
2014	టీకేఆర్	టీడీపీ	మల్‌రెడ్డి రంగారెడ్డి	కాంగ్రెస్	30,786
2018	సబితారెడ్డి	కాంగ్రెస్	టీకేఆర్	టీఆర్ఎస్	9,227

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మహేశ్వరం	72	33156	31790	7	64,953
కందుకూరు	61	25550	24689	1	50,240
బాలాపూర్	245	153074	14474	56	2,97,884
సరూర్‌నగర్	133	64492	59095	3	1,23,590
మొత్తం	511	2,76,272	2,60,328	67	5,36,667



ఆమనగల్లు: కేటీఆర్ సమక్షంలో చేరికలు



‘గులాబీల జెండలే రామక్క..’ పాటపాడుతున్న మహిళలు

గులాబీ.. జోరు

- ప్రజా ఆశీర్వాద సభ, రోడ్‌షో సక్సెస్
- బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ, షాద్‌నగర్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విచ్చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నేతలు ఆయన సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి కేటీఆర్ పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి స్వాగతించారు. రోడ్‌షోకు వచ్చిన జనం మంత్రికి నీరాజనం పలికారు. ఆశీర్వాద సభ, రోడ్‌షో సక్సెస్‌తో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త జోష్ నింపింది. – ఆమనగలు/షాద్‌నగర్



షాద్‌నగర్: రోడ్‌షోలో గులాబీ జెండాలతో బీఆర్ఎస్ కార్యకర్తలు



రోడ్‌షోకు తరలి వెళ్తున్న పార్టీ నాయకులు

మీరే మా అతిథులు!

- నగరంలో జోరుగా సాగుతున్న ఎన్నికల ప్రచారం
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నేతల ఫీట్లు
- కార్నర్ మీటింగ్‌లు, విందు, వినోదాలతో సభలు
- ఆదివారం కిటకిటలాడిన ఫంక్షన్ హాళ్లు, హోటళ్లు

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. మరో ఇరువై నాలుగు రోజుల్లో ఓటరు తన తీర్పును వెలువరించేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో వివిధ పార్టీలు ప్రచారాన్ని ఉధృతం చేశాయి. గల్లీ సభలు, ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లతో కిర్రాక్ పుట్టిస్తున్నాయి. ఫంక్షన్ హాళ్లలో విందులు, వినోదాలతో వేడుకలను నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం నగరంలోని పలు ఫంక్షన్ హాళ్లలో పార్టీ సమావేశాల పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు, విందులు ఏర్పాటు చేశారు. మరోవైపు త్రీస్టార్ హోటళ్లు, రెస్టారెంట్‌లు, బిర్యానీ సెంటర్‌లు సైతంకిటకిటలాడాయి. సాధారణ ప్రజలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల అనుచరణ గణాలతో అన్ని చోట్లా రద్దీ నెలకొంది. నాయకులు, అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు నానా పాట్లు పడుతున్నారు. ఎక్కడికక్కడ కార్నర్ మీటింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

ఆశల పల్లకిలో...

ప్రస్తుత ఎన్నికల వేళ ఓటర్లు కోరిందల్లా ఇచ్చేందుకు తాము సిద్ధమని నాయకులు ప్రకటిస్తుండగా.. ఎన్నో ఏళ్ల పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తే తప్ప ఓటు వేయబోమంటూ ప్రజలు భీష్మించుక్కూర్చుంటున్నారు. దీంతో ఓటర్లను బుజ్జగించే కార్యక్రమాలు కూడా జోరుగా సాగుతున్నాయి. డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం ఏళ్ల తరబడి పడిగాపులు కాసిన జనం రాతపూర్వకమైన హామీ ఇస్తే తప్ప ఓటేయబోమంటూ నాయకులకు అల్టిమేటం జారీ చేస్తున్నారు. మరోవైపు కొండమీది కోతినైనా తెచ్చి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసానిస్తున్న నాయక మహాశయులు కూడా ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, కులాల వారీగా వివిధ సంఘాల నాయకులతో రాతపూర్వమైన హామీ పత్రాలను తీసుకుంటున్నారు. ఇరువైపులా ఎన్నికల క్రీడ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇంచుమించు మరో ఇరువై మూడు రోజుల పాటు సాగనున్న ఈ వినోదభరితమైన ఆటకు కమ్యూనిటీ హాళ్లు, ఫంక్షన్‌హాళ్లు, స్థానిక నేతల ఇళ్లు వేదికలవుతున్నాయి. యథావిధిగా అన్ని చోట్ల గుట్టుచప్పుడు కాకుండా మద్యం గుప్పుమంటోంది.

ఓటరు ఎటు వైపో...

నగరంలోని వివిధ ప్రాంతాల్లో అన్ని వర్గాల ఓటర్లకు చేరువయ్యేందుకు ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అనుచరులు శక్తివంచన లేకుండా కష్టపడుతున్నారు.ఏ పార్టీ నాయకులు పలకరించినా తన ఓటు మీ పార్టీకే అంటూ చల్లగా సెలవిస్తున్న ఓటర్లు చివరి నిమిషంలో ఎటువైపు మళ్లుతారోననే ఆందోళన అభ్యర్థులను వెంటాడుతోంది. తమ గెలుపు నల్లేరు మీద బండి నడక అనే ధీమాతో ఉన్న నాయకాగ్రేసరులు సైతం కొద్ది రోజులుగా సందిగ్ధావస్థలో ఉన్నారు. ఇప్పటి నుంచి ఎంత ప్రచారం చేసినా, గల్లీలు, బస్తీలు వడపోసినా చివరి సమయం కీలకం కావడంతో చాలామంది ‘పోల్ మేనేజ్‌మెంట్’పై ఆశలు పెట్టుకొని ప్రచారానికి బయలుదేరడం గమనార్హం.